క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బయ్య భిక్షపతి గ్రామంలో బైక్‌పై తిరుగుతూ అరటిపండ్లు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో అరటిపండ్లు అమ్మి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి ఓబైక్ అతివేగంగా వస్తుండడంతో అదుపుతప్పి అక్కడే ఆగిఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సీఐ రవిరాజు స్థానికుల సాయంతో అస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నియామకం



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులోని సమ్మక్క–సారలమ్మ జాతర నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జాతర కమిటీ చైర్మన్‌గా రాయిడి రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

పరకాల : మండల కేంద్రంలో ఎల్బా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి స్పెల్ విజర్డ్, డ్రామా స్కిట్ కాంపిటీషన్‌లో పరకాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీశ్వత, సిరి, వర్షిత, భవ్యశ్రీ, అక్షయ, నందిని, పావని ప్రతిభ కనబర్చగా ఎంఈఓ రమాదేవి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధుతో పాటు ఉపాధ్యాయులు సదయ్య, సరళ, నవత, రమ, శారద, పద్మ, విద్యాసాగర్, సారంగపాణి విద్యార్థులను అభినందించారు. ఎల్బా మండల బాధ్యుడు స్వామి, కల్పన, మండల కోకన్వీనర్ శంకర్, లక్‌పతినాయక్, పద్మ, ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌస్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

కమలాపూర్ : మండల కేంద్రం శివారులోని ఆర్‌ఆర్ దాబాలో సోమవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.45,800 విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ బి.సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌ఆర్ దాబాలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దీంతో రూ.45,800 విలువ గల మద్యం లభించగా సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. దాబా యజమాని రవిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన గాజుల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు స్వర్గం రవి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. స్వర్గం రవి పంపించిన రూ.5 వేల నగదును స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెండు రాధికరమేష్, పద్మశాలి సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, కోశాధికారి పత్తిపాక మురళి, నాయకులు మేరుగు శివానందం, కనుకుంట్ల అశోక్, మణికంఠ, పద్మశాలిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పరకాల : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన నేరేళ్ల పరశురామ్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దగ్ధమైన ఇంటిని పరిశీలించిన ఆయన ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ ఉన్నారు.

ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి తల్లి పెద్ది పూలాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కార్పొరేటర్ రాధికారెడ్డి, పెద్ది నరేందర్‌రెడ్డి, దేవేందర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు వేలంపాట

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల శ్రీగట్టు మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర ఉత్సవాల్లో కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర తదితర వస్తువులను విక్రయించుకునేందుకు నేడు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలంపాట ప్రారంభం కానుందని తెలిపారు. కొబ్బరికాయలు ,పూజ సామగ్రి రూ.15 వేలు, లడ్డూ, పులిహోరా రూ.5వేలు, తలనీలాలు రూ.5వేలు, కొబ్బరి ముక్కలు సేకరించుకునే హక్కు రూ.3 వేలు ధరావత్తు ఉంటుందన్నారు.

అప్పులు తెచ్చి పనులు చేశాం.. బిల్లులిప్పించండి

- మండల సభలో సర్పంచ్‌ల వేడుకోలు
- 'కుడా' నుంచి 12 గ్రామాలను తొలగించాలని విజ్ఞప్తి
- పలు సమస్యలపై చర్చ



మిషన్ భగీరథ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే



సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కమలాపూర్ : 'ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశాం. మాకు రావాల్సిన బిల్లులు వెంటనే ఇప్పించండి. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి, మా పదవీకాలం కూడా ముగుస్తుంది' అని మండలంలోని సర్పంచ్‌లు వేడుకున్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తడక రాణి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల రవీందర్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు వారి ఆవేదన వెల్లగక్కారు. మరో రెండు రోజుల్లో తమ పదవీకాలం ముగుస్తోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తమను నిలబెట్టి మరీ పనులు చేయించిన అధికారులు బిల్లులు ఇప్పించే విషయంలో తమకు సహకరించడం లేదని వాపోయారు. పదవిలో ఉన్నప్పుడే సహకరించని అధికారులూ పదవి లేనప్పుడు సహకరిస్తారా అని ప్రశ్నించారు. మాకు బిల్లులు ఇచ్చేది, ఇప్పించేది ఎవరని, ఒక్కో సర్పంచ్‌కు రూ.5 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని 12 గ్రామాలను కుడా పరిధిలో కలిపారని, ఇంటి అనుమతులు, ఇతరత్రా పనుల కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కుడా పరిధిలో కలిపిన గ్రామాలను తొలగించి గ్రామ పంచాయతీలకు సంపూర్ణ అధికారాలు ఇవ్వాలని కోరారు. ఉప్పల్‌లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించి వదిలేశారని గత మూడు సభల్లో ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంబంధిత అధికారులను మందలించారు. నెల రోజులుగా మర్రిపల్లికి పంచాయతీ కార్యదర్శి లేరని, తనకు తెలియకుండానే చెక్కులు జనరేట్ చేసుకున్నారని సర్పంచ్ రజిత ఆవేదన వ్యక్తం చేశారు. వాగుల్లో నిర్మించిన చెక్‌డ్యాంలు భారీ వర్షాలకు కొట్టుకుపోయని, కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగు నీరందక నీటి ఎద్దడి తలెత్తుతోందని, వాగు పరీవాహక ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని మాదన్నపేట ఎంపీటీసీ శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తెలిపారు. సర్పంచుల పదవీ కాలం పొడగించడంతో పాటు సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని, కుడా పరిధిలో కలిపిన 12 గ్రామాలను తొలగించి జీపీలకు సంపూర్ణ అధికారాలివ్వాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సభ ప్రారంభానికి ముందు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఈజీఎస్ టీఏ సంతోష్‌కు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ కల్యాణి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, తహసీల్దార్ మాధవి, ఎంపీడీఓ బాబు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకోవాలి : సీడీపీఓ



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యలక్ష్మి

శాయంపేట : ఆడపిల్లలను కాపాడుకోవడం అందరి బాధ్యతని పరకాల సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఆడ పిల్లలను పురుషులతో సమానంగా చూడాలని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం కోసం కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, కంప్యూటర్ ట్రెనింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం బలంగా ఉంటుందన్నారు. అలాగే బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మహిళలకు సమస్యలు ఎదురైతే సఖీ సెంటర్ 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కౌన్సిలింగ్, వైద్య సహాయం, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, గృహహింస సమస్యలను సఖి కేంద్రంలో పరిష్కరింపబడుతాయని అన్నారు. అనంతరం బేటి బచావో– బేటి పడావో ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల హెచ్‌ఎం మాధవి, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ లావణ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కావ్య పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



విజేతలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న ధర్మప్రకాశ్

ధర్మసాగర్ : గ్లోబలైజేషన్ సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్ ధర్మప్రకాశ్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఇంగ్లిష్ సబ్జెక్టు ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ ఎస్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్పెల్ విజార్డ్, ఆంగ్ల డ్రామా ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత గ్లోబలైజేషన్ పోటీలు ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడేందుకు ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని అన్నారు. స్పెల్ విభాగంలో పెద్దపెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూష ప్రథమ బహుమతి, డ్రామా పోటీల్లో సాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీల్లో అర్హత పొందారు. స్పెల్ ద్వితీయ బహుమతి మల్లక్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కృష్ణప్రియ, ఆంగ్ల డ్రామాల్లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా రవీందర్, పద్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు : ఈనెల 31వ తేదీన ఫాతిమానగర్‌లోని బాలవికాస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు కార్మికులు, ప్రజలు తరలిరావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమావేశం మేకిరి మోహన్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా చుక్కయ్య హాజరై మాట్లాడారు. సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈనెల 31, ఫిబ్రవరి 1,2 తేదీల్లో హనుమకొండలోని ఫాతిమానగర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. రైల్వే, విమానాశ్రయాలు, రక్షణ రంగం తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్నారని, బీజేపీ మతోన్మాద విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వరంగ రక్షణ కోసం సీఐటీయూ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. 31న వేయి స్తంభాలగుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ర్యాలీకి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులడు బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేనతో పాటు ఆలిండియా కార్మిక సంఘం నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కేఎస్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మోతే రాజుకుమార్ తెలిపారు. టెన్నికాయిట్ జూనియర్స్‌లో ఏ.నిషిత్, వాలీబాల్‌లో శివకుమార్, అథ్లెటిక్ విభాగం అండర్–17లో ఏ.రాహుల్ జావలిన్‌త్రో విభాగంలో నేషనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. టీఎంఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్టులో గణిత ప్రతిభ పరీక్షలో సిద్ధార్థ మొదటి బహుమతి రూ. 1500నగదు పురస్కారం, జస్వంత్ తృతీయ బహుమతి రూ.500 నగదు పురస్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, పీఈటీ అభినందించారు.

విద్యను మించిన ఆస్తిలేదు : కేయూ వీసీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తాటికొండ రమేష్

ఐనవోలు : విద్యను మించిన ఆస్తి ప్రపంచంలోనే లేదని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ తాటికొండ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఏకశిల ఈ టెక్నో స్కూల్, పున్నేలులో విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ తాడికొండ రమేష్, మామునూరు డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడమే గెలుపు కాదని, ఆ గెలుపు నలుగురికి ఉపయోగపడినప్పుడే అసలైన విజయం సాధించినట్లు అన్నారు. చదువు విషయంలో విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతీ విద్యార్థి తనకు అనుగుణంగా సమయాన్ని మలుచుకోవాలని అన్నారు. ఎలాంటి కష్ట, నష్టాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా లక్ష్యాన్ని చేధించే మార్గంలో పయనిస్తే విజయం వరించడం ఖాయమని అన్నారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్యం చాలా అమూల్యమైనదన్నారు. మంచి అలవాట్లు సత్ప్రవర్తన కలిగి భారత పౌరుడిగా దేశానికి సేవ చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. వ్యసనాలకు, చెడు మార్గానికి దూరంగా ఉండాలన్నారు. గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఏకశిల విద్యాసంస్థలు నిత్య నూతన ఒరవడితో మంచి ఫలితాలతో ప్రత్యేక శైలితో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. డైరెక్టర్ కొండల్‌రెడ్డి, శివప్రసాద్, వీవీ రమణరెడ్డి, ఎండీ బాబా, రవికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదకర బావులను వెంటనే పూడ్చండి



బావిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

దామెర : జాతీయ రహదారి వెంబడిఉన్న ప్రమాదకర బావులను వెంటనే పూడ్చాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎస్సై కొంక అశోక్ రైతులకు సూచించారు. సోమవారం 163వ నంబరు జాతీయ రహదారి దామెర క్రాస్‌రోడ్డు నుంచి గుడెప్పాడ్ క్రాస్‌రోడ్డు వరకు ఇరువైపులా ఉన్న ప్రమాదకర బావులను పరిశీలించి వాటిని పూడ్చి సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడారం జాతర నేపథ్యంలో జాతీయ రహదారిపై రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఇరువైపులా వాహనాలు నిలిపేందుకు వీలుగా పలు ప్రదేశాలను గుర్తించామన్నారు. జాతీయ రహదారిపై వాహనాలను నిలుపొద్దని సూచించారు. వీరి వెంట ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, సర్వేయర్ కవితారాణితో పాటు తదితరులు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల హైస్కూల్‌లో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. పాఠశాల స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్షం బలరాంతో పాటు తిరుపతి, శ్రీనివాస్, రఘు, సతీష్, చంద్రశేఖర్, చంద్రమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో విద్యనభ్యసించాలి

దామెర : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని ఎస్సై అశోక్ అన్నారు. సోమవారం పసరగొండ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపసర్పంచ్ పరికిరాల మధు, చందా రమేష్‌లు రూ. 20వేలు విలువ చేసే బ్యాగ్‌లు, పదోతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్లను అందించారు. హెచ్‌ఎం వసుమతి, సర్పంచ్ సాంబయ్య, ఎంపిటీసీ కళ పాల్గొన్నారు.

ఉపాధిహామీ సదస్సుకు తరలాలి

దామెర : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న ఉపాధిహామీ చట్టం పరిరక్షణ రాష్ట్ర సదస్సుకు ఉపాధిహామీ కూలీలందరూ విధిగా హాజరుకావాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ కోరారు. ముస్త్యాలపల్లి గ్రామంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని ఉల్లంఘిస్తుందని, యాప్‌లతో కూలీలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి హక్కులను కాపాడేందుకు తోడ్పాటునందించాలన్నారు. సదస్సులో పంచాయతీరాజ్ గ్రామీణ భివృద్ధి శాఖ మంత్రి సీతక్క హాజరుకానున్నట్లు తెలిపారు.

చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి

కమలాపూర్ : విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి వహించి మంచి మార్కులు సాధించాలని బీసీ డెవలప్మెంట్ అసిస్టెంట్ అధికారి సీహెచ్.రవీందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన దుస్తులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న పదోతరగతి, ఇతర తరగతుల విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శంకరయ్య, సిబ్బంది అరుణ్, రాజమౌళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : నిరుపేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు మాట్లాడుతూ.. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేద ప్రజలకు 200రోజుల పనిదినాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప, జిల్లా కమిటీ సభ్యురాలు లోకిని స్వరూప, మండల కార్యదర్శి మమత పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు ఉమాదేవి, ఆగమ్మ, మోహన్‌రావు, షర్మిల, శ్రీధరాచారి, శ్రీరామచంద్రమూర్తి, బిందుమాధవి, ఉమారాణి, పాపయ్య, కోమల, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆరేళ్ల కల నెరవేరింది

- ఎంపీపీ మధుమతి



నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఐనవోలు : నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన రాంనగర్‌లో గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రజల కల నేటికి నెరవేరిందని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మండలంలోని రాంనగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధులు సుమారు రూ.20లక్షలతో పంచాయతీ భవనం నిర్మించినట్లు ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చిన్న గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయగా నందనం గ్రామపంచాయతీ నుంచి రాంనగర్‌ను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ భవనాన్ని నూతనంగా ఏర్పాటు చేసుకోవాలన్న గ్రామస్తుల కల ఆరేళ్లకు నెరవేరిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, సర్పంచ్ బోయినపల్లి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ఈద సుధాకర్, ఎంపీటీసీ దామెర అనూష, వార్డు సభ్యులు యాకర హరిబాబు, కోతి నర్సయ్య, ఉల్లెంగుల లింగమ్మ, బొమ్మినేని మాధవి, ఆకులపెల్లి వినోద, మహ్మద్ యాకూబ్, బుర్ర రమ, కార్యదర్శి సుంకరి రఘురామ్, నాయకులు దేవదాసుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం దృష్టికి 'కన్నారం' సమస్య

- చర్య తీసుకోవాలని వేడుకోలు



మంత్రితో మాట్లాడుతున్న ఎంపీటీసీ బుచ్చమ్మ

వేలేరు : కన్నారం మండల మార్పుపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారుల సమక్షంలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవ విషయాన్ని ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ, పలువురు గ్రామస్తులు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామానికి వచ్చిన మంత్రిని కలిశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తాము మద్దతు తెలపడంతో కొందరు వ్యక్తులు కక్షతో దాడి చేశారని తెలిపారు. దాడి చేసిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరగా న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మద్యం సీసాలు.. మందుబాబుల ఆగడాలు



నడికూడ : విద్యాబుద్ధులు నేర్పించే పాఠశాలలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లోనే కాకుండా పాఠశాలలో సైతం మద్యం బాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలంలోని రామకృష్ణపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిత్యం ఈ సంఘటన చోటుచేసుకుంటంది. పాఠశాలకు సెలవు వస్తే చాలు మద్యం తాగి సీసాలను పగులగొట్టి వీరంగం సృష్టిస్తున్నారు మందుబాబులు.. పలు మార్లు గ్రామ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా గతంలో ఇదే గ్రామం సంపూర్ణ మద్యపాన నిషేధ గ్రామంగా గుర్తింపు తెచ్చుకోవడం కొసమెరుపు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాణ్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)